ప్రజాశక్తి

గురువారం 18 ఏప్రిల్ 2024 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

నేటి నుండి నామినేషన్ల స్వీకరణ

ఆర్‌ఒ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ

ఎన్నికల నిర్వహణలో కీలకమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమవుతుంది. ఇందుకుగాను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఈనెల 18 నుండి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే స్వీకరణ ఉంటుంది. అభ్యర్థితో కలుపుకొని ఐదుగురికి మాత్రమే ఆర్‌వో

(మిగతా 2లో)



మచిలీపట్నంలో జరిగిన సభకు హాజరైన జనం; అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, వి.బాల[illegible] కొల్లు రవీంద్ర



వార్త 2లో

బందరుకు పూర్వవైభవం

ప్రజాగళంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్

తీర్పు-2024



దిగ్గజాల గడ్డ విజయవాడ

పార్లమెంట్ విజేతల్లో హరీంద్రనాథ్, అచ్చమాంబ, కెఎల్‌రావు

16 సార్లు ఎన్నికలు జరగ్గా 11 దఫాలు విజేత కాంగ్రెస్సే

నాలుగు సార్లు గెలిచిన టిడిపి

ప్రభావంతమైన పాత్ర పోషించిన కమ్యూనిస్టులు

కథనం మధ్య పేజీలో

బందరుకు పూర్వవైభవం

ప్రజాగళంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, కలెక్టరేట్, పెడన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే బందరుకు పూర్వవైభవం తీసుకువస్తామని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం పెడన బస్టాండ్ సెంటర్, జిల్లా కేంద్రం మచిలీపట్నం కోనేరు సెంటర్ సమీపంలో జరిగిన ప్రజాగళం సభల్లో పవన్ కళ్యాణ్‌తో కలిసి చంద్రబాబు మాట్లాడారు. బందరు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. బందరు, పెడన ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేస్తామన్నారు. బందరు-రేపల్లె రైల్వేలైను పూర్తి చేస్తామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభిసీతారామయ్య మెమోరియల్ భవన నిర్మాణానికి అనుమతులు ఇస్తామన్నారు. పెడనలో కళంకారీ పరిశ్రమను ఆదుకుంటామన్నారు. బందరు అభివృద్ధికి ఎమ్మెల్యే పేర్ని నాని నిధులు తీసుకు రాకపోగా అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బందరు అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకువచ్చారో చెప్పాలన్నారు. వీరి పాలనలో బందరులోని తాడేపల్లి సత్రము భూములు, రంగనాయకస్వామి ఆలయభూములు కబ్జాకు గురయ్యాయన్నారు. బందరులో మల్టీప్లెక్స్ మాల్‌కు అనుమతులు ఇవ్వడానికి ఇబ్బందులు పెట్టారన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్రను అన్యాయంగా కేసులో ఇరికించారని, భవిష్యత్‌లో పేర్నికి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. జిల్లాలో వైసిపికి చెందిన ఒకరు బూతుల నానీ అనీ, మరొకరు నీతుల నానీ అన్నారు. ప్రజలకు అధికారం ఇచ్చింది బూతులు తిట్టడానికి కాదన్నారు. బందరు వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్ని కిట్టు గంజాయి, సెటిల్మెంట్‌లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సిఎంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తా : పవన్

పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి తన పెళ్లిళ్ళ గురించి మాట్లాడే స్థాయికి సిఎం జగన్ దిగజారారన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. చంద్రబాబుకు అనుభవం ఉందని, తనకు పోరాడే శక్తి ఉందని అన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని యువత కూటమికి ఓటెయ్యాలన్నారు. చేనేత కార్మికులు అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకోకూడదని, దీనికి సరైన ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో చేనేత కార్మికులకు, సంఘాలకు రావాల్సిన బకాయిలు అధికారంలోకి రాగానే జమ చేస్తామన్నారు. అలాగే పట్టణ పరిధిలో కలంకారీ పరిశ్రమకు ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసి, చెరువు తవ్వి నీటిని నింపేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. దీనివలన కలంకారి పరిశ్రమకు అవసరం అయ్యే నీటిని నింపి దీనిలో దుస్తువులను శుభ్రం చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. దీనివలన కార్మికులకు అలాగే కూలీలకు, కలంకారీ రంగానికి మరింత ఆదరణ పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సముద్ర ప్రాంతాలైన మత్స్యకారులకు మత్స్య సంపద పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో జెట్టీలు నిర్వహిస్తామన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ విషయంలోనూ అధిక ధరలు పెంచడంతో రైతులు ఆక్వా సాగు చేయడం లేదన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం గతంలో విద్యుత్ అందించిన ధరలకే రైతులకు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

బందరు అభివృద్ధిని నాని అడ్డుకున్నారు : బాలశౌరి

బందరు అభివృద్ధిని ఎమ్మెల్యే పేర్ని నాని అడ్డుకున్నారని ఎంపి, జనసేన మచిలీపట్నం అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ఆరోపించారు. భోగరాజు పట్టాభిసీతారామయ్య మెమోరియల్ భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా అడ్డుపడ్డారన్నారు. ఈ సభల్లో టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణరావు, మాజీ మంత్రి, మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర, పెడన అభ్యర్థి కాగిత కష్ణ ప్రసాద్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, జనసేన జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, బిజెపి జిల్లా అధ్యక్షులు గుత్తికొండ రాజాబాబు, తదితరులు మాట్లాడారు.





శ్రీరామ నవమి వేడుకల్లో కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

శ్రీరామనవమి వేడుకల్లో కలెక్టర్ డిల్లీరావు


ప్రజాశక్తి-విజయవాడ

శ్రీరామనవమి సందర్భంగా జిల్లా కలెక్టరేట్, ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ప్రత్యేక వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులతో కలిసి పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని.. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కళ్యాణంలో సిపి దంపతులు

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా స్థానిక ఎంజి రోడ్‌లోని పోలీస్ క్వార్టర్స్ సాయుధ రిజర్వ్ పోలీస్ రామాలయంలో సతీసమేతంగా బుధవారం పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికినారు. అనంతరం సిపి దంపతులు సాంప్రదాయ పద్ధతిలో స్వామి వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. వారి చేతుల మీదుగా సీతారాముల ఉత్సవమూర్తులకు కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సిపి దంపతులు అందరికీ శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు అధిరాజ్ సింగ్ రాణా, కె.చక్రవర్తి, ఎబిటిఎస్ ఉదయరాణి, డిసిపి బి.రామకష్ణ, ఎడిసిపిలు కష్ణమూర్తి నాయుడు, టి.కనకరాజు, కె.శ్రీహరిబాబు, కె.కోటేశ్వర రావు, ఎసిపిలు బి.పార్థసారథి, తేజేశ్వరరావు, కష్ణంరాజు, డాక్టర్ స్రవంతి రాయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న సిపి రాణా దంపతులు

నేటి నుండి నామినేషన్ల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఛాంబర్‌లోకి అనుమతి ఉంటుంది. నామినేషన్లు దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలను అనుమతిస్తారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అవగాహన కల్పించేందుకు పార్లమెంటు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. పార్లమెంట్ అభ్యర్థి రూ.25 వేలు, అసెంబ్లీ అభ్యర్థి రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు ఈ డిపాజిట్‌లో 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. ఈ నెల 26న నామినేషన్ల స్క్రుటినీ ఉంటుంది. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంటుంది. మే 13న ఎన్నికలు జరుగుతాయి.

నామినేషన్ల ప్రక్రియకు సర్వం సన్నద్ధం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ

ఎన్నికల నిర్వహణలో కీలకమైన నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభంకానున్న నేపథ్యంలో అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు.నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ ఎన్నికల మీడియా కేంద్రంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. ఏప్రిల్ 18 ఉదయం 11 గంటలలోపు ఆర్‌వోల సంతకంతో తెలుగు, ఇంగ్లీష్‌లో నామినేషన్లకు సంబంధించి ఫారం 1 పబ్లిక్ నోటీస్ ఇస్తామన్నారు. దీన్ని జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలోని ముఖ్యమైన కార్యాలయాల్లో పబ్లిష్ చేయనున్నట్లు వివరించారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి కలెక్టర్ ఆర్‌వోగా ఉంటారని, నామినేషన్లను కలెక్టర్ కార్యాలయంలో స్వీకరించనున్నామని తెలిపారు. అలాగే తిరువూరు అసెంబ్లీకి అక్కడి ఆర్‌డీవో కార్యాలయంలో విజయవాడ పశ్చిమకు పశ్చిమ తహశీల్దార్ కార్యాలయంలో, సెంట్రల్‌కు మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో తూర్పుకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో, మైలవరంనకు అక్కడి తహసీల్దార్ కార్యాలయంలో, నందిగామకు అక్కడి ఆర్‌డీవో కార్యాలయంలో, జగ్గయ్యపేటకు అక్కడి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని కలెక్టర్ వివరించారు. నామినేషన్ల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. నామినేషన్ల వేసే ప్రాంతాల్లో ఆర్‌వో కార్యాలయం బయట, లోపల కూడా సీసీటీవీలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి నామినేషన్లు వేయకూడదన్నారు. అభ్యర్థుల ఓటు ఇతర నియోజకవర్గాల్లో ఉంటే ఆయా నియోజకవర్గాల ఈఆర్‌వోల నుంచి తీసుకున్న సర్టిఫైడ్ ఎక్స్‌ట్రాక్ట్ కాపీని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 26న నామినేషన్ల స్క్రుటినీ, 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరణ ఉంటాయని తెలిపారు. అనంతరం సింబల్‌ను కేటాయిస్తామన్నారు. పోటీలో నిలిచిన అభ్యర్థులను ఫారం-7ఏ ద్వారా ప్రకటిస్తామన్నారు. అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిశీలనకు ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాలన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నికల ఖర్చును అతని ఖాతాలో లెక్కిస్తామన్నారు. మే 1న ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు అనుసంధానించి మే 2, 3, 4 తేదీల్లో ఈవీఎం కమిషనింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. 600 మంది వరకు మైక్రో అబ్జర్వర్లు ఉన్నారని, వీరికి ఈనెల 28న శిక్షణ ఇస్తామని తెలిపారు. మే 7-9 తేదీల్లో హోం ఓటింగ్‌కు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతాయని తెలిపారు. నోవా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నిమ్రా కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ భవనాల్లో స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల సమయంలో గతంలో చోటుచేసుకున్న ఘటనల ఆధారంగా క్రిటికల్ పోలీంగ్ స్టేషన్లను గుర్తించామని, అక్కడ వెబ్‌క్యాస్టింగ్ వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 16,98,000 ఓటర్లు ఉన్నారని, ఈనెల 24వ తేదీలోపు కొత్తగా ఓటు నమోదు, బదిలీకి సంబంధించిన దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ మే 13న తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిర్లిప్తతను తొలగించి పోలింగ్ శాతం పెంచేలా విస్తతంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ డిల్లీరావు వెల్లడించారు.



హ్యాండ్ బుక్‌ను రిలీజ్ చేస్తున్న కలెక్టర్ డిల్లీరావు, జెసి సంపత్‌కుమార్

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టర్ బుధవారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, డిఆర్వో కె. చంద్రశేఖర రావులతో కలిసి కలెక్టరేట్ ఎన్నికల విభాగం మీడియా సెంటర్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024 సంబంధించి ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవు దినాలు మినహా) ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈనెల 26వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ, 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు అన్నారు. మే 13వ తేదీన ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. పార్లమెంటుకు ఫారం-2 ఎ, అసెంబ్లీకి ఫారం-2 బి లో నామినేషన్లు దాఖలు చేయవలసి ఉంటుందని, ఫారం 26 లో అఫిడవిట్ సమర్పించాలని, అఫిడవిట్లో అన్ని కాలమ్స్ నింపాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేసే జనరల్ అభ్యర్థులు 25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే జనరల్ అభ్యర్థులు పది వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పార్లమెంటుకు రూ.12,500, అసెంబ్లీకి రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. రిజర్వు నియోజకవర్గానికి పోటీ చేయు అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు కొత్తగా బ్యాంకు ఎకౌంటు తెరచి, వివరాలు సమర్పించాలని, అన్ని ఎన్నికల ఖర్చులు ఈ ఎకౌంటు ద్వారా చేయాలన్నారు. నామినేషన్ పత్రాలలో గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులు తమను బలపరిచే ఒకరి సంతకం, ఇతరులు, ఇండిపెండెంట్లు పది మంది బలపరిచే వారి సంతకాలు తప్పనిసరి అన్నారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి కలెక్టరేట్లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వారి చాంబర్, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి, బందర్ ఆర్డీవో కార్యాలయంలో, పెడన తాసిల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి చాంబర్, అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి చాంబర్, పామర్రు తాసిల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి చాంబర్, పెనమలూరు తాసిల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి చాంబర్, గన్నవరం తాసిల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి చాంబర్, గుడివాడ ఆర్డిఓ కార్యాలయం రిటర్నింగ్ అధికారి వారి చాంబర్ లలో నామినేషన్లు దాఖలు చేయవచ్చు అన్నారు. జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా డి.ఎస్.పి. స్థాయిలో, మచిలీపట్నం పార్లమెంట్‌కి ఏఎస్పి స్థాయిలో పోలీసు అధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో మూడు కంపెనీల కేంద్ర భద్రతా బలగాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో అదనపు భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.


పూర్ణిమకు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

సివిల్ జడ్జి పూర్ణిమకు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడలో న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు తనకు ఎంతో సహకరించారని సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ న్యాయవాదులను కొనియాడారు. సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ మూడు సంవత్సరాలు పూర్తయి బదిలీపై వెళ్తున్న సందర్భంగా గుడివాడ పట్టణ ఏలూరు రోడ్డులోని కోర్టు బార్ అసోసియేషన్‌లో మంగళవారం రాత్రి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నాగలక్ష్మి పాల్గొన్నారు. తొలుత పూర్ణిమను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గుడివాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొడాలి హరినాథ్ మాట్లాడుతూ గుడివాడ కోర్టుకు పూర్ణిమ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బి.అజయ్‌బాబు, జనరల్ సెక్రటరీ ఎన్ నటరాజ్, బార్ ఎక్స్ ప్రెసిడెంట్ టి శ్రీనివాస్, లైబ్రరీ సెక్రటరీ సిహెచ్ కుటుంబరావు, జాయింట్ సెక్రెటరీ ఎన్ సాంబశివరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎం రాజేష్, ట్రెజరీ ప్రకాష్, జులేఖ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం కేసరపల్లి పంచాయతీలోని వియస్ పురం కాలనీవాసులు తాగునీటి కోసం బుధవారం రోడ్డు ఎక్కారు. స్థానికంగా ఉన్న రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ సక్రమంగా నీటిని సరఫరా చేయడం లేదని మహిళలు ధ్వజమెత్తారు. మంచినీరు సమస్య గురించి ఏ ఒక్క నాయకుడు పట్టించుకోవట్లేదు అంటే పరిస్థితులు అర్థం చేసుకోవాలని అన్నారు. రోజు మొత్తంలో ఒక్కసారి పది నిమిషాలు కూడా పంపులో నీళ్లు రావడంలేదని తెలిపారు. రాత్రి మూడు గంటలకు నీళ్ల వదిలితే ఏ విధంగా ఆడవాళ్లు పట్టుకుంటారని నిలదీశారు. ఈ కార్యక్రమంలో మహిళలు స్థానికులు పాల్గొన్నారు. రెండు వేల కుటుంబాలు వున్న గ్రామంలో నీటి సమస్య రాకుండా చూడాలని సిపిఎం మండల కార్యదర్శి ఆంజనేయులు కోరారు.





చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి ట్యాక్సీ ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్న కార్ల స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని నాని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలసౌరి సోదరుడు బాలకోటేశ్వరరావు, ఎంపిటీసీ మేకా బంగారుబాబు, అసోసియేషన్ నేతలు గంజాల రాధాకృష్ణ, పరిసే రాంబాబు, ఆత్మకూరి వెంకటేశ్వరరావు, నర్రా చిన్ని, ట్యాక్సీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణం, మండల పరిధి గ్రామాల్లో బుధవారం రామాలయాలు, ఆంజనేయస్వామి మందిరాలతో పాటు పలు కూడళ్లలో పందిళ్లువేసి సీతారామ కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉయ్యూరులో గౌడ రామాలయం, కాపుల రామాలయం, పంచపట్టాభిరామ స్వామి ఆలయం, రత్న రెసిడెన్సీ, శివాలయం రోడ్డులో రామమందిరం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, పలియాల శ్రీనివాస్, జనసేన నాయకుడు కార్తికేయ, జోగి రమేష్, జంపాన పూర్ణచంద్రరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు పాల్గొన్నారు. కోదండరామ స్వామి ఆలయం నుండి గ్రామోత్సవం నిర్వహించారు. **కోదూరు :** కోదూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ షిరిడి సాయి దివ్య ధ్యాన జ్ఞాన మందిరంలో జమ్ములమడక సుబ్రహ్మణ్యం దంపతులు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రేపల్లె వెంకటనారాయణ (రఘు) పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, బడే గంగాధర్ పాల్గొన్నారు. **చల్లపల్లి:** శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక బందర్ రోడ్డులోని శ్రీ రామా టెక్స్టైల్స్ అధినేత పసుపులేటి రోశయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పానకం, పులిహోర, పొంగలి పంపిణీ చేశారు. **గుడివాడ :** వాసవి చౌక్ వద్దగల శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కొడాలి నాని పాల్గొన్నారు. శ్రీరాంపురంలోని వెలమ సంక్షేమ సంఘ భవనంలో నవమి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, పట్టణ ప్రముఖులు దండమూడి సీతారామస్వామి, శేగు రామారావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల భాస్కరరావు, రవి స్వీట్స్ మోహన్ పాల్గొన్నారు. గుడివాడ టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము పాల్గొన్నారు. **పెదపారుపూడి:** పెదపారుపూడి రామాలయ ప్రాంగణంలో వేద పండితులు లక్ష్మీనరసింహాచార్యులు సీతారాములకు కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.


పెదపారుపూడిలో...


ఉయ్యూరులో...



దగా చేసిన ప్రభుత్వాలను సాగనంపండి

ఇండియా వేదిక నాయకులు

ప్రజాశక్తి-కంకిపాడు: ఏపి ప్రజలను దగా చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న ఎన్నికల్లో సాగనంపాలని ఇండియా వేదిక నాయకులు పిలుపునిచ్చారు. పెనమలూరు నియోజకవర్గ ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిశల సుబ్రహ్మణ్యం విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం కాంగ్రెస్ నాయకులు కిలారు వెంకటరత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనేకుల మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసి సంపన్నులకు దారాదత్తం చేసిన మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ కుల మతాల మధ్య చిచ్చు పెట్టి అభివృద్ధిని అటకెక్కించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలన్నారు. మస్తాన్ వలి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మద్యపాన నిషేధం చేస్తానని వాగ్దానం చేసి నాసిరకం బ్రాండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు త్రిమూర్తులు, కాంగ్రెస్ పార్టీ పెనమలూరు మండల అధ్యక్షులు అరికట్ల సురేష్, రాజశేఖర్ వర్మ, బాలాజీ నాయక్, కొనసం రాము, కైలే సునీల్, రాజేష్, కీర్తి, సిహెచ్.భవాని, పుసులూరి పాతాళ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో వైసిపి ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి-పెదపారుపూడి: వైసిపి పామర్రు నియోజకవర్గ అభ్యర్థి కైలే అనిల్ కుమార్ పామర్రు తన కార్యాలయం నుండి ఎన్నికల ప్రచారం బుధవారం ప్రారంభించినట్లు మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, వైసిపి సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు, పెదపారుపూడి ఎంపీపీ గోగం సురేష్, పామర్రు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ చిగుర్తి వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా యలకుర్రు, కొరుమెర్ల, ప్రాకర్ల తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకు వెళ్లి వచ్చే ఎన్నికలలో మరో అవకాశం కల్పించాలని కోరారు.



అనుదీప్ పుట్టినరోజు వేడుకలు


ప్రజాశక్తి-చల్లపల్లి: మచిలీపట్నం కూటమి ఎంపి అభ్యర్థి వల్లభనేని బాలసౌరి తనయుడు వల్లభనేని అనుదీప్ పుట్టినరోజు వేడుకలు చల్లపల్లి బస్టాండ్ సెంటర్లో అడపా రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా రాంబాబు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి పట్టణ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, గంగిశెట్టి బాబు రాజేంద్ర, పసుపులేటి రవికుమార్, అడపా రమేష్, పామర్తి రామారావు, కడవకొల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లంకమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలో వేంచేసి ఉన్న శ్రీ లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారి గ్రామోత్సవ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఆలయ ఈవో యార్లగడ్డ వాసు ఆధ్వర్యంలో ప్రారంభమైన గ్రామోత్సవంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, రైతు విభాగం జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎమ్మెల్యే తనయుడు సింహాద్రి వికాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్ల బండిపై అమ్మవారిని ప్రతిష్టించి బ్రహ్మోత్సవానికి తల్లి వెళ్లారు. లంకమ్మ అమ్మ వారి మీద సూరగం రామకృష్ణ రచించిన గేయాలకు సంబంధించిన ఆడియో క్యాసెట్‌ను యార్లగడ్డ వాసు, న్యాయవాది రామిశెట్టి వేణుగోపాల్, గుడిసేవ విష్ణుప్రసాద్ ఆవిష్కరించారు.



ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
గురువారం
18 ఏప్రిల్ 2024





దిగ్గజాల గడ్డ విజయవాడ



దేశంలో ప్రసిద్ధి చెందిన పార్లమెంటరీ నియోజకవర్గాల్లో విజయవాడ కూడా ఒకటి. ఈ స్థానం నుంచి స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీ నాయుడు సోదరుడు, సుప్రసిద్ధ ఆంగ్ల కవి, కమ్యూనిస్టు అభిమాని హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, ప్రముఖ సంఘ సేవకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు కొమర్రాజు అచ్చమాంబ, ప్రముఖ ఇంజినీరు, కేంద్రమంత్రిగా పనిచేసిన కెఎల్ రావు వంటి ఉద్దండులు ఇక్కడ నుంచి విజయం సాధించిన వారిలో ఉన్నారు. ఇక్కడ నుంచి గెలుపొందిన వారిలో ఇద్దరు కేంద్రమంత్రులుగా పనిచేశారు. ఒకరు కెఎల్ రావు కాగా, మరొకరు పర్వతనేని ఉపేంద్ర. మరొకరు లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయనే గోడె మురహరి. ఓటమి చెందినప్పటికీ ఇక్కణ్నుంచి దిగ్గజాలు అనదగిన కమ్యూనిస్టు నేతలు నండూరి ప్రసాదరావు, దాసరి నాగభూషణరావు, తమ్మిన పోతరాజు వంటి వారు పోటీ చేశారు.

కాంగ్రెస్‌కు పెట్టని కోట

1952 నుంచి ఇప్పటివరకూ 16సార్లు పార్లమెంటరీ ఎన్నికలు జరగ్గా మొట్టమొదటి ఎన్నికల్లో ఆంగ్ల కవి హరీంద్రనాథ్ చటోపాధ్యాయ కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో విజయం సాధించారు. మిగతా 15 సార్లలో 11 దఫాలు కాంగ్రెస్ పార్టీ.. ఇందిరా కాంగ్రెస్ పేరుతోగానీ, భారత జాతీయ కాంగ్రెస్ పేరుతోగానీ విజయం సాధించింది. మిగిలిన నాలుగు సార్లు టిడిపి విజయం సాధించింది. దీన్నిబట్టి ఇది కాంగ్రెస్‌కు పెట్టని కోట అనవచ్చు. అయితే రాష్ట్ర విభజన తరువాత మార్పు వచ్చింది.

తొలి విజయం కమ్యూనిస్టులదే

1952 నుంచి 1977 వరకూ ఈ స్థానంలో సిపిఐ, సిపిఎంలు కూడా తమ ప్రాభవాన్ని చాటాయి. తొలి ఎన్నికల్లో కమ్యూనిస్టు అభిమాని హరీంద్రనాథ్ చటోపాధ్యాయ విజయం సాధిస్తే.. 1957లో కేవలం 2 వేలా 8 ఓట్ల అతి స్వల్ప ఓట్ల తేడాతో కమ్యూనిస్టు పార్టీ ఓటమి చవిచూసింది. అప్పుడు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ.. కమ్యూనిస్టు అభ్యర్థి తమ్మిన పోతురాజుపై విజయం సాధించారు. ఆ తరువాత 1962లో జరిగిన ఎన్నికల్లోనూ ప్రఖ్యాత ఇంజినీరు కెఎల్ రావు అతి స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఆయనకు ప్రత్యర్థిగా కమ్యూనిస్టు నేత నండూరు ప్రసాదరావు పోటీ చేశారు. కెఎల్ రావుకు 1,77,794 ఓట్లు రాగా, నండూరు ప్రసాదరావుకు 1,54,811 ఓట్లు వచ్చాయి. ఆ తరువాత కూడా సిపిఐ, సిపిఎం 1977 వరకూ ఏదో ఒకటి పోటీ చేస్తూ ఎన్నికల్లో ప్రభావం చూపుతూ వచ్చాయి. ఆ తరువాత పలు ఎన్నికల్లో సిపిఐగానీ, సిపిఎంగానీ పోటీ చేయలేదు. అయితే కొద్దికాలం తర్వాత విజయవాడలోని పార్లమెంటరీ నియోజకవర్గంలోని పశ్చిమ శాసనసభ స్థానం నుంచి కమ్యూనిస్టులు మూడు సార్లు ఎంఎల్‌ఎలుగా గెలిచారు. మరో రెండు సార్లు కార్పొరేషన్‌లో జయకేతనం ఎగురవేశారు.

1984లోనే తొలిగా కాంగ్రేసేతర పార్టీ గెలుపు

1982లో ఆవిర్భవించిన టిడిపి 1984లో ఇక్కడ నుంచి ప్రప్రథమంగా కాంగ్రెసేతర పార్టీగా విజయం సాధించింది. అప్పట్నుంచి ఈ స్థానం నుంచి జరిగిన ఎన్నికల్లో 1999లో ఒకసారి, 2014, 2019లో మరో రెండుసార్లు మొత్తంగా నాలుగుసార్లు విజయం సాధించింది. ఆ పార్టీ పక్షాన ఇప్పటి వరకూ వడ్డే శోభనాద్రీశ్వరరావు, గద్దె రామమోహనరావు, కేశినేని శ్రీనివాస్ (నాని) విజయం సాధించారు.

– ఎం.బి.నాథన్

పార్లమెంట్ విజేతల్లో హరీంద్రనాథ్, అచ్చమాంబ, కెఎల్‌రావు

16 సార్లు ఎన్నికలు

11 దఫాలు విజేత కాంగ్రెస్సే

నాలుగు సార్లు గెలిచిన టిడిపి

ప్రభావంతమైన పాత్ర పోషించిన కమ్యూనిస్టులు

సంవత్సరం	విజేత పేరు	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1952	హరీంద్రనాథ్ చటోపాధ్యాయ	ఇండి		(కమ్యూనిస్టు తోడ్పాటు)
1957	కొమర్రాజు అచ్చమాంబ	కాంగ్రెస్	తమ్మిన పోతురాజు	కమ్యూనిస్టు
1962	కెఎల్ రావు	కాంగ్రెస్	నండూరి ప్రసాదరావు	కమ్యూనిస్టు
1967	కెఎల్ రావు	కాంగ్రెస్	ఏకగ్రీవం	---
1971	కెఎల్ రావు	కాంగ్రెస్	దాసరి నాగభూషణరావు	కమ్యూనిస్టు
1977	గోడె మురహరి	కాంగ్రెస్	జి.మురళీమోహన్	జనతా
1980	చెన్నుపాటి విద్య	కాంగ్రెస్	కెఎల్ రావు	జనతా
1984	వడ్డే శోభనాద్రీశ్వరరావు	టిడిపి	చెన్నుపాటి విద్య	కాంగ్రెస్
1989	చెన్నుపాటి విద్య	కాంగ్రెస్	వడ్డే శోభనాద్రీశ్వరరావు	టిడిపి
1996	పర్వతనేని ఉపేంద్ర	కాంగ్రెస్	వడ్డే శోభనాద్రీశ్వరరావు	టిడిపి
1998	పర్వతనేని ఉపేంద్ర	కాంగ్రెస్	దాసరి జయరమేష్	టిడిపి
1999	గద్దె రామమోహన్	టిడిపి	పర్వతనేని ఉపేంద్ర	కాంగ్రెస్
2004	లగడపాటి రాజగోపాల్	కాంగ్రెస్	చలసాని అశ్వనీదత్	టిడిపి
2009	లగడపాటి రాజగోపాల్	కాంగ్రెస్	వల్లభనేని వంశీమోహన్	టిడిపి
2014	కేశినేని శ్రీనివాస్ (నాని)	టిడిపి	కోనేరు రాజేంద్రప్రసాద్	వైసిపి
2019	కేశినేని శ్రీనివాస్ (నాని)	టిడిపి	పొట్లూరి వీర ప్రసాద్	వైసిపి

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం 'సెంట్రల్' అభ్యర్థి సిహెచ్.బాబూరావు



సిపిఎం అభ్యర్థి బాబూరావుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

ప్రజాశక్తి–అజిత్ సింగ్‌నగర్

ప్రజలపై భారాల మీద భారాలు మోపుతూ ధరలు అదుపు చేయలేని పాలకులను రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఇండియా వేదిక విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు పిలుపునిచ్చారు. బుధవారం 59వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రామరాజ్యం పేరుతో మోడీ రావణ రాజ్యం సాగిస్తున్నారన్నారు. మోడీతో జతకట్టిన టిడిపి, వైసిపి, జనసేన పార్టీలను ఓడించాలన్నారు. రామరాజ్యం అంటే ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అలా కాకుండా ప్రజలపై భారాలు వేసి ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నారని అన్నారు. గ్యాస్, పెట్రోల్ ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, నిత్యావసర వస్తువులు కొనలేని స్థితికి చేరుకున్నాయని అన్నారు. ధరలను నియంత్రించలేని పాలకులు ఉన్నారని విమర్శించారు. ప్రజలు మధ్య విద్వేషాలు పెంచి ప్రజల మధ్య గొడవలు సృష్టించే పార్టీలను ఓడించకపోతే దేశం నాశనం అయిపోతుందన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో కరెంటు తీయడం, కేబుల్ కట్ చేయడం, ఇంటర్నెట్ లేకపోవడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రాన్ని రాళ్ల రాష్ట్రంగా చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు రాళ్ల విసురుకోవడం తగదన్నారు. సిఎంపై దాడి నేపథ్యంలో వడ్డెర కాలనీ వాసులపై తప్పుడు కేసులు పెట్టి వారిని చిన్నచూపు చూడటం తగదన్నారు. విజయవాడ నగరాభివృద్ధి కమ్యూనిస్టుల హయాంలోనే జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీయాలంటే ఖచ్చితంగా సిపిఎం, ఇండియా వేదిక అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణారావు, కె.దుర్గారావు, ఎస్‌కె పీర్, నాగేశ్వరరావు, రాంబాబు, సింగ్‌నగర్ డివిజన్ నాయకులు ఎన్‌సన్యాసిరావు, ఎం.నాగార్జున, మురారి, ఎ.పున్నారావు, రసూల్, రఫీ, లక్ష్మీప్రసాద్, రత్నకుమారి, కిషోర్, సిపిఐ టి.దుర్గమ్మ, కె.నారాయణ, కాంగ్రెస్ నాయకులు కిరణ్‌కుమార్, చిట్టి, పి.కిషోర్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.





'కృష్ణా'లో ప్రజాగళం

కృష్ణాజిల్లా పెడన, మచిలీపట్నంలో టిడిపి ప్రజాగళం సభలు బుధవారం జరిగాయి. ఈ సభలకు టిడిపి అధినేత చంద్రబాబుతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బందరులో రోడ్ షో నిర్వహించారు. ఇరుపార్టీల అధినేత రాకతో బందరు కోనేరు సెంటరు కిక్కిరిసిపోయింది. రోడ్ షోకు కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. యువత బైక్ ర్యాలీలతో బందరు రహదారులు కిక్కిరిసిపోయాయి. మహిళలు రహదారికి ఇరువైపులా బారులు తీరి నేతలకు అభివాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, టిడిపి పెడన, మచిలీపట్నం అభ్యర్థులు కాగిత కృష్ణప్రసాద్, కొల్లు రవీంద్ర, బిజెపి జిల్లా అధ్యక్షులు జి.రాజాబాబు తదితరులు సభల్లో పాల్గొన్నారు.

రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్





ఎర్రజెండాకు చట్ట సభల్లో అవకాశమివ్వండి

సిపిఎం గన్నవరం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి–గన్నవరం

రానున్న ఎన్నికల్లో ఎర్రజెండాకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం గన్నవరం మండలంలోని బూతిమిల్లిపాడు, బుద్దవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను, మద్యం వల్ల కలిగే నష్టాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వీధికి మద్యం షాపులు వచ్చాయి కానీ ఈ సంవత్సరం వచ్చిన నీటి ఎద్దడి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజాసమస్యలపై ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందన్నారు. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేసి సిపిఎంకు మద్దతు పలకాలని కోరారు. దేశాన్ని సర్వనాశనం చేస్తున్న బిజెపి దాని మద్దతు పార్టీలైన టిడిపి, వైసిపిలను ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గన్నవరం మండల కమిటీ సభ్యులు బడుగు మరిదాసు, గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల కమిటీ సభ్యులు మీరా ఖాన్, నాయకులు అరుణ్, కరిముల్లా, షేక్ బాజీ, వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు

ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలన



ప్రజాశక్తి–మచిలీపట్నం రూరల్

ఎన్నికల సందర్భంగా బుష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం సందర్శించారు.పోలింగ్ అనంతరం ఆయా నియోజకవర్గాల నుండి ఈవీఎంలు కష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రానికి తరలించి, కౌంటింగ్ కేంద్రంలో ఆయా సెగ్మెంట్ల వారీగా కేటాయించిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచే వరకు ఏర్పాటు చేయవలసిన మార్గాలు, ఈవీఎంల రిసెప్షన్ కేంద్రాల ప్రదేశాలు కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు.పోలింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలు పోలింగ్ సిబ్బందితో వచ్చే వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు చదును చేసే పనులు కలెక్టర్ పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు రోలర్ లతో పటిష్టం చేయించాలని సూచించారు. కష్ణ విశ్వవిద్యాలయ భవనాలకు నలువైపులా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములకు ఏర్పరచిన మార్గాలకు ఆయా వాహనాలు చేరేలా మార్గాలు చదును చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా మార్గ సూచికలు (సైనేజ్ బోర్డులు) ఏర్పాటు చేయాలన్నారు. విశ్వవిద్యాలయం ప్రాంగణం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ పనులు వేగవంతం చేయాలని విశ్వవిద్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, సర్వే ఏడి మనీషా త్రిపాఠి, డ్వామా పీడీ సూర్యనారాయణ, పిఆర్ ఈఈ శ్రీనివాసరావు, కష్ణ విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ సుందర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాబూరావుకు ఆటో కార్మికుల మద్దతు



రైల్వే స్టేషన్ వద్ద ప్రచారం చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి–విజయవాడ

ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావును గెలిపించుకోవాల్సిన కర్తవ్యం అందరిపై ఉందని ఆటో కార్మికులు అన్నారు. ఈ నెల 19న జరిగే బాబూరావు నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విజయవాడ రైల్వేస్టేషన్ మెయిన్ గేటు వద్ద ఆటో కార్మికులు బుధవారం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. బాబూరావు నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బాబూరావు గెలుపు మనందరి గెలుపు అంటూ ఆటో కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ, వారికి అండగా నిలిచే బాబూరావును గెలుపించుకోవాల్సిన కర్తవ్యం ఆటో కార్మికులపై ఉందన్నారు. కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరిచిన ఇండియా వేదిక సెంట్రల్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు నామినేషన్ కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలనలో ఆటో మోటార్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భవిష్యత్తులో ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే సెంట్రల్ నియోజకవర్గంలో బాబురావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నగర ఆటో వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె.దుర్గావళి, కార్యనిర్వాహక కార్యదర్శి డి.కోటయ్య, నగర నాయకులు ఎ.వి రెడ్డి, ఆర్.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులందుకున్న చిన్నారులు

ముగిసిన మహాత్ముల జయంతి వారోత్సవాలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూజగజ్జీవన్ రాంలి గార్ల జయంతి వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో చిన్నారులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రత్తిపాటి ఇస్సాకు, ఎలిజబెత్ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రత్తిపాటి పాల్ ఇమ్మానుయేలు ఈ బహుమతులను అందించారు. మొదటి బహుమతి చాట్ల వెంకట్, రెండో బహుమతి అన్ను, మూడో బహుమతి అమత గెలుపొందారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవ జి విశ్వనాథ్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ గౌరవ సలహాదారుడు ప్రత్తిపాటి పాల్ఇమ్మానుయేలు, వార్తాప్రభ విలేకరి చాట్ల సుబ్బు తదితరులు పాల్గొన్నారు .

చింతలపూడి పూర్తి కావాలంటే టిడిపి రావాలి : వసంత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : చింతలపూడి ఎత్తిపోతల పథకం, అమరావతి రాజధానిగా పూర్తి కావాలంటే రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని మైలవరం శాసనసభ టిడిపి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాదు అన్నారు. రంగాపురం, రుద్రవరం, నరుకుళ్ళపాడు గ్రామాల్లో జరిగిన టిడిపి ఆత్మీయ సమావేశం వేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

దళిత ద్రోహి చంద్రబాబు : ఎంపి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: దళితులలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని ఎస్సీలను తీవ్రంగా అవమా నించిన చంద్ర బాబు నాయు డును రానున్న ఎన్నికల్లో ఘోరంగా ఓడించాలని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. మంగళవారం రాత్రి జగ్గయ్య పేట పట్టణంలోని ఎస్ జి ఎస్ కళాశాల ఆవరణలో వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ఎస్సీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నందిగామ సురేష్ పాల్గొని మాట్లాడుతూ జగన్‌ను ప్రజలందరూ అండగా ఉండాలని ఎంపీ కేశినేని నానిని, ఉదయభానుని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను మాట్లాడుతూ వైసిపి దళితుల పార్టీ అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు మాట్లాడారు. విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను, యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు, రాష్ట్ర నెడ్ క్రాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, దుర్గగుడి డైరెక్టర్ అల్లూరి కృష్ణవేణి, వత్సవాయి జడ్పిటిసి యేసుపోగు దేవమని, తదితరులు పాల్గొన్నారు.

19 నుండి ఉచిత యోగా శిక్షణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : శ్రీ వెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్ట్ ఎస్‌వి సిటీ సౌజన్యంతో శాంతివన్ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుండి మే 2వ తేదీ గురువారం వరకు వేసవి ఉచిత యోగ శిక్షణా తరగతులను ఇబ్రహీంపట్నం సి కాలనీ ఆడిటరియంలో నిర్వహించడం జరుగుతుందని శాంతివన్ యోగ ఫౌండేషన్ అధ్యక్షులు యోగ గురువు లంకె జనార్ధన్ తెలిపారు. ఈ నెల 19న ఉదయం 6 గంటలకు యోగా అవగాహనా సదస్సుతో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఏప్రిల్ 19 నుండి మే 2వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా 6 గంటల నుండి 7.30 వరకు రెండు బ్యాచెస్‌గా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మవ్యాయామాలు, సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, బందాలు ధ్యాన పద్ధతులు, విశ్రాంతి విధానాలు, యోగానిద్ర తదితర అంశాలపై అవగాహన కల్పించి, సాధన చేయించనున్నట్లు పేర్కొన్నారు. వెన్ను నొప్పి, స్థూలకాయం, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, గ్యాస్ట్రిక్ తదితర దీర్ఘకాల వ్యాధులకు యోగ థెరఫీ వల్ల ఉపశమనం ఎలా లభించగలదో వివరించనున్నట్లు పేర్కొన్నారు. వత్తిడి, కోపం, ఆందోళన, చింత, చికాకులను యోగ ద్వారా ఎలా అధిగమించగలమనే అంశాలను వివరిస్తామని తెలిపారు. ఈ సదవకాశాన్ని పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఉపయోగించుకోవలసిందిగా పేర్కొన్నారు. సాధకులు విధిగా యోగ మ్యాట్ లేదా మందపాటి దుప్పటి, వాటర్ బాటిల్, నాప్కిన్ తప్పనిసరిగా తమతో పాటు తెచ్చుకోవాలన్నారు. వివరాలకు లంకె జనార్దన్ 6301454859 ఫోన్ నంబర్ లో సంప్రదించాలని కోరారు.

బుర్రకథతో ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణ ప్రధాన వీధుల్లో ఓటర్లకు (స్వీప్ యాక్టివిటీస్) ఓటు ప్రాధాన్యతపై బుర్రకథ ద్వారా అధికారులు బుధవారం అవగాహన నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఐదేళ్ళ పాటు మీ భవిష్యత్‌ను నిర్ణయించేసేది మీరు ఓటేసి ఎన్నుకునే ప్రభుత్వమేనని తహశీల్దార్ ప్రకాష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు, ఎలెక్షన్ డి.టి నాగమణి పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - విసన్నపేట : గ్యాస్ లీక్ అయి ప్రమాదం జరిగినప్పుడు దాని నుండి ఎలా కాపాడుకోవాలో స్థానిక వాసవి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో ఆఫీస్, డెలివరీ సిబ్బందికి తెలిపారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా ఎలా అదుపు చేయాలో నివారణ చర్యలు ఎలా తీసుకోవాలో చెప్పారు. ఫైర్ ఆఫీసర్ బి.నానిక ఆధ్వర్యంలో అగ్నిప్రమాదంలో జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు.

పలుచోట్ల శ్రీరామ నవమి వేడుకలు



ఆంజనేయు గుడి వద్ద...

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పటమట ఎలక్ట్రిసిటి కాలనీ ఎనిమిదో లైన్ నల్లూరు చక్రధర రావు రోడ్డులో పంచముఖ ఆంజనేయ స్వామి గుడి వద్ద కాలనీ వాసులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. వేదమంత్రాలు, మేళతాళాల నడుమ స్వామి వారి కళ్యాణం కనుల పండువగా జరిగింది. నల్లూరు కాశీ, గర్నేని చలపతిరావు, గద్దె తిలక్, పీ మధుసూదన్రావు, నల్లూరు అఖిల్, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. యాత్రికులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైసిపి తూర్పు నియోజకవర్గం అభ్యర్థి దేవినేని అవినాష్ కల్యాణోత్సవంలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు గద్దె వెంకట బాల గంగాధర్ తిలక్, కిలారు సత్యనారాయణ మాట్లాడారు. కొత్తగా నిర్మించిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయాలనేది కాలనీవాసుల పదిహేనేళ్ల కల అని, ఈ నెల 21న సాకారం కానుందని, అన్నదానం కార్యక్రమం ఉంటుందని అన్నారు. హరే కృష్ణ గోకుల క్షేత్రంలో, హరే కృష్ణ మూమెంట్ ఇండియా ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా రామ తారక యజ్ఞం, రథ మహోత్సవం, రామ నామ సంకీర్తనను నిర్వహించారు. ఈ సందర్భంగా హరే కృష్ణ గోకుల క్షేత్ర అధ్యక్షులు శ్రీ వంశీధర దాస మాటాడారు. సీతారాముల పల్లకి ఉత్సవం, భరత నాట్యం కార్యక్రమాలు అద్భుతంగా జరిగాయి.



కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానంలో (వన్‌టౌన్)

యాత్రికులకు అన్న ప్రసాద వితరణ చేశారు. హరే కృష్ణ గోకుల క్షేత్రంలో, హరే కృష్ణ మూమెంట్ ఇండియా ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా రామ తారక యజ్ఞం, రథ మహోత్సవం, రామ నామ సంకీర్తనను నిర్వహించారు. ఈ సందర్భంగా హరే కృష్ణ గోకుల క్షేత్ర అధ్యక్షులు శ్రీ వంశీధర దాస మాటాడారు. సీతారాముల పల్లకి ఉత్సవం, భరత నాట్యం కార్యక్రమాలు అద్భుతంగా జరిగాయి. యాత్రికులకు అన్న ప్రసాద వితరణ చేశారు. **భవానీపురం :** 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, దుర్గారావు ఆధ్వర్యంలో వైసిపి పశ్చిమ కార్యాలయంలో సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహించారు. వైసిపి పశ్చిమ అభ్యర్థి షేక్ అసిఫ్ కుమార్తె రేష్మ, అల్లుడు అప్సర్ పీటలపై కూర్చుని కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం ప్రసాదం, పానకం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** ఇంద్రకీలాద్రిపై శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహనాధికారి కెఎస్.రామరావు సమక్షంలో ఆలయ ప్రధానార్చకులు, అర్చక సిబ్బందిచే కళ్యాణం నిర్వహించారు. శ్రీ సీతారామ స్వాములకు, లక్ష్మణ, ఆంజనేయులకు పట్టువస్త్రాలు సమర్పించారు. యాత్రికులకు పానకం పంపిణీ చేశారు.

కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానంలో శ్రీ సీతా రామస్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. సీతారాములకు ఆలయం కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు మాధవి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లాశ్రీనివాసరావు, కమిటీ మాజీ అధ్యక్షులు పోతిన బేసికంతేశ్వరుడు తదితర కమిటీ సభ్యులు ఏర్పాట్లును పర్యవేక్షించారు. యాత్రికులకు ప్రసాదం కమిటీ వారు అందజేశారు. 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు వందేళ్ళ చరిత్ర ఉన్న రథంపై రథోత్సవ కార్యక్రమం పురవీధుల్లో నిర్వహించనున్నారు. 20న ఉదయం 10 గంటలకు అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. **గంపలగూడెం:** స్థానిక టౌన్ పరిధిలో ఉన్న శ్రీ సీతారామ ఆలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ నిర్వహించింది. ఊటుకూరు, పెనుగలను శ్రీ కోదండ రామాలయాల్లో, తోటముల శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ముందు ఈ కళ్యాణ వేడుకలు నిర్వహించారు. **వాత్సవాయి :** మండలంలోని వత్సవాయి, కన్నెవేడు సింగవరం, మక్కపేట, భీమవరం, తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో యాత్రికులకు పులిహోర, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. **మైలవరం :** వైసిపి మైలవరం నియోజకవర్గ అభ్యర్థి సన్నాల తిరుపతిరావు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మైలవరంలోని రెడ్డి సేవా సంఘం, రామకృష్ణ కాలనీలోని ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక లీలావతి పబ్లిక్ స్కూల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ శ్రీరామ నవమి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు వేషధారణలతో అలరించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** శ్రీ రామ నవమి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళ విబాగ్, వాసవి కపుల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం దాతల మోటమర్రి లక్ష్మి, పేరూరి నరసింహారావు సహకారంతో మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట ఎస్సై ఐ డి.సూర్యబాగవన్ విచ్చేసి ప్రారంభించారు. తొర్రగుంటపాలెం ఆంజనేయ స్వామి గుడిలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. వైసిపి యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. **తిరువూరు :** శ్రీరామనవమి వేడుకలను తిరువూరు పట్టణ, రూరల్ గ్రామాల ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. తిరువూరులోని శ్రీ కోదండ రామాలయం, శ్రీ షిరిడి సాయి మందిరం, రాజుపేట శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, చీరాల సెంటర్లోని ఆంజనేయస్వామి మందిరం, పాటిమీద భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో వేడుకలు నిర్వహించి పానకం, వడపప్పు ప్రసాద పంపిణీ చేశారు. వాస్తవి క్లబ్ సభ్యులు భద్రాచలం సీతారామ కళ్యాణంలో పాల్గొని తిరిగి వెళ్లే ఆర్టీసీ ప్రయాణికులకు స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మంచినీరు, మజ్జిగ అందజేశారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి ఇందిరానగర్‌లో సీతారాముల కళ్యాణ మహోత్సవం కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఆలయ అర్చకులు నాగరాజ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతారామాంజనేయ స్వామి దేవాలయాలలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి మైలవరం వైసిపి అభ్యర్థి సర్నాల తిరుపతిరావు హాజరయ్యారు. ఆయనకు పండితులు వేదాశీర్వచనం అందించారు. **విజయవాడ :** గురునానక్ కాలనీ విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో శ్రీరామనవమి సందర్భంగా కేశినేని శివనాథ్‌ను విజయవాడ పశ్చిమ ఇంటలెక్చువల్ ఫోరం కమిటీ వారు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివనాథ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా కాసేపు ప్రస్తుత రాజకీయాలపై చిన్ని వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కొణిజేటి రమేష్, రామపిళ్ళ శ్రీనివాస్, సముద్రాల ప్రసాద్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా దువ్వల రామకృష్ణ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకర్ల లక్ష్మీనారాయణ బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నుంచి వచ్చిన నియామక పత్రాలను ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను వారికి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అభ్యర్థుల ప్రచారాలు

ప్రజాశక్తి - పెనమలూరు : ఉప్పులూరులో మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, బోడే ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ఎంపిపి నెర్సు రాజ్యలక్ష్మీ, జనసేన నేత ముప్పా రాజా, మండల టీడీపీ అధ్యక్షుడు సుదిమల్ల రవీంద్ర, స్థానిక నేతలు అన్నే ధనయ్య (ఉప్పులూరు), నెర్సు సతీష్, సుబ్రహ్మణ్యం, మధుసూదన రావు, చెన్నుపాటి బుజ్జి, శివయ్యలతో పాటు క్రీస్తు (గొల్లగూడెం), సుధాకర్, బండి కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి..

ప్రజాశక్తి - కోడూరు: అవనిగడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అనందే శ్రీరామ్‌మూర్తి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోడూరు మండలంలో ప్రచారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు.

వైసిపి అభ్యర్థి...

ప్రజాశక్తి - కోడూరు : రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను గెలిపించాలని సింహాద్రి రమేష్ బాబు కోడూరులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బుధవారం సాయంత్రం కోడూరులోని శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవాలయం దగ్గర నుంచి ప్రధాన సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, యువ నాయకులు వికాస్, స్థానిక వైసిపి నేతలతో కలిసి నిర్వహించారు.

టిడిపి అభ్యర్థి పర్యటన

ప్రజాశక్తి - గుడివాడ(నందివాడ) : నందివాడ మండలంలోని బండివాని గూడెం, గోపాలపురం, గొంగళ్ళమూడి గ్రామాల్లో టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము మంగళవారం రాత్రి ఆయా గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. మాజీ మంత్రి పిన్నమనెని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు తదితర పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి, గుడివాడ రూరల్: దుర్మార్గ ప్రభుత్వాన్ని బూడిద చేసే రోజు మే 13న వస్తుందని ప్రతి ఒక్కరూ తమ అమ్యూల్యమైన ఓటును తెదేపాకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం శేరిగొల్వేపల్లిలో బాబు షఉ్యరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టి ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు.

కళ్యాణ వేడుకల్లో అన్నసమారాధన

ప్రజాశక్తి, గుడివాడ రూరల్: రెండో అపర భద్రాద్రిగా పేరు గాంచిన గుడివాడ మండలం మోటూరులోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో బుధవారం శ్రీ సీతారామస్వామి వారి తిరుక్కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు శ్రీ సీతారామస్వామి వారి కళ్యాణ వేడుకలు వేద మంత్రోర్చనల నడుమ అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. భద్రాద్రిలో కళ్యాణ ముగియగానే స్వామి వారు ఇక్కడకు విచ్చేస్తారు. ఇక్కడ నిర్వహించే కళ్యాణానికి అంతటి ప్రాధాన్యం ఉందని పండితులు భక్తులకు వివరిస్తూ అమ్మవారిని, స్వామి వారిని కళ్యాణ వేదిక వద్దకు తోడుకుని వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణ క్రతువును పూర్తి చేశారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. విజయదుర్గ మహిళా కోలాట సమాజం వారు కోలాటం నిర్వహించి భక్తులకు ఉత్తేజపరిచారు. శ్రీ విద్య విద్యాసంస్థల యాజమాన్యం గుడివాడ మార్కెట్ వద్ద నుంచి ఆలయం వరకు భక్తులకు ఉచిత బస్సు సర్వీసులు నడిపింది. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రత కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గొరిపర్తి నాగమౌనిక, పూర్వపు ఆలయ కార్యనిర్వహణాధికారి షణ్ముగం, యాత్రికులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి కృషి : ఎంపి మోపిదేవి

ప్రజాశక్తి - అవనిగడ్డ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తేనే అగ్నికుల క్షత్రియుల జీవితాల్లో మార్పు వస్తుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ తెలిపారు మంగళవారం సాయంత్రం అవనిగడ్డలోని ఎన్ఆర్ఐ వికాస్ పాఠశాల ప్రాంగణంలో అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు వైసిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగిడి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక మత్స్యకారులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంతో పాటు వాగ్దానం చేయని హామీలను కూడా నెరవేర్చారన్నారు గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉండగా మత్స్యకారులకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానము నెరవేర్చలేదని తెలిపారు. జనసేన పార్టీ కోసం మొదటి నుండి కష్టపడ్డ వారికి టికెట్లు లేవని చంద్రబాబు మనుషులకు టికెట్లు ఇచ్చి పోటీ చేస్తున్నారని ఆరోపించారు అలా టికెట్ తెచ్చుకున్న వ్యక్తి మండలి బుద్ధప్రసాద్ అని ఊసరవెల్లిలా ఖండాలు మార్చుకున్న వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లపనేని బాలశౌరి బుద్ధ ప్రసాదును ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కంటికి కనిపించకుండా ప్రాణాలు కాపాడుకునేందుకు దాకున్నా నాయకులను నమ్మవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో బందరు వైసిపి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మత్స్యకార సంఘాల నాయకులు అభ్యర్థులను సత్కరించారు.

మండలి ప్రచారం

ప్రజాశక్తి - అవనిగడ్డ : జనసేన అభ్యర్థుల విజయంతోనే అవనిగడ్డ నియోజకవర్గం అభివృద్ధి అని జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌర్లను గెలిపించుకోవడం ద్వారానే నియోజకవర్గాన్ని అభివద్ధి చేసుకుంటామని టిడిపి జనసేన బిజెపి పార్టీలకు చెందిన నాయకులు దక్షిణ చిరువోలు లంక గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గంలోనూ రాష్ట్రంలోనూ విధ్వంస పాలనను తెలియజేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇచ్చే పథకాలు అభివృద్ధి గురించి గ్రామ ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు టిడిపి జనసేన మండల పార్టీల అధ్యక్షులు యా సం చిట్టిబాబు గుడివాక శేషుబాబు మండల పార్టీ కార్యదర్శి బచ్చు మురళి జనసేన నాయకులు గుడివాడ శివరావు, పంచాయతీ వార్డు సభ్యులు పీత వెంకటేశ్వరరావు లంకమ్మ అమ్మవారి ట్రస్ట్ మాజీ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు ఘంటసాల కన్నయ్య బిజెపి నాయకులు టీవీ గిరి శోభిల ఏడుకొండలు నడకుదుటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - పెదపారుపూడి: యాదవ ఆత్మీయ సమావేశం జయప్రదం చేయండి: గొరిపర్తి యాదవ ఆత్మీయ సమావేశం నేడు గుడివాడ వి కె ఆర్, వి ఎన్ బి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సాయంత్రం గం4:00లకు జరుగుతున్నందున మండలంలోని యాదవ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని న్యాయవాది గొరిపర్తి రవికుమార్ ఒక ప్రకటన లో ఆ సంఘ నాయకులకు పిలుపునిచ్చారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి : యార్లగడ్డ

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం నియోజవర్గంలో అన్ని వర్గాల అభివద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గన్నవరం నియోజవర్గ టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. గన్నవరం రోటరీ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జరిగిన రజక సంఘం ఆత్మీయ సమావేశం పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం నియోజవర్గంలోని రజకుల సమస్యలు పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో రజకచెరువుల అభివద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. పోలవరం కాలవ పై శాశ్వతంగా మోటార్లు ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని మెట్ట గ్రామాలలో తాగునీటి, సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని హామీ ఇచ్చారు. పోలవరం కాలువ నీటితో గ్రామాల్లోని చెరువుల నింపి సాగునీటి కొరత తీరుస్తామని చెప్పారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దువ్వారపు రామారావు, ఎమ్మెల్సీ రజక సాధికార రాష్ట్ర కన్వీనర్ గుర్రపుశాల రామకష్ణ, కృష్ణాజిల్లా రజక సాధికార చాగంటి కృష్ణ, గన్నవరం మండలం తెలుగు యువత అధ్యక్షుడు చీమలదండు శివరామకృష్ణ, గన్నవరం మండలం మహిళా అధ్యక్షురాలు చిక్కవరపు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కొడాలి నాని ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - గుడివాడ :

గుడివాడ పట్టణంలో ఎమ్మెల్యే కొడాలి ఎన్నికల ప్రచారం బుధవారం 21వరోజుకు చేరుకుంది. గుడివాడ 12వ వార్డులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని నిర్వహించిన గడపగడపకు ప్రచారంలో గుడివాడ ఓల్డ్ బైపాస్ రోడ్డులో వైఎస్ఆర్సీపీ శ్రేణులు ఎమ్మెల్యే నానికు ఘన స్వాగతం పలికి ముస్లిం సాంప్రదాయం ప్రకారం సత్కరించారు. పార్టీ శ్రేణులు వార్డు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే నాని గడపగడపకు ప్రచారాన్ని ప్రారంభించారు. మైనార్టీలు అత్యధికంగా నివసించే 12వ వార్డులోని మైనార్టీ సోదరీమణులు తమ సాంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే నానికి ఆశీస్సులు అందజేశారు. వార్డులోని పవిత్ర జెండాలు చెట్టు వద్ద మత గురువులతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ మైనార్టీ సోదరుల వార్డులో నిర్వహిస్తున్న ప్రచారంలో వీధి వీధినా సోదరులు చూపుతున్న ఆదరణను ఎన్నటికీ మర్చిపోలేనన్నారు. ప్రజలందరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై నొక్కి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కొడాలి నాని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యూత్ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, సీనియర్ నాయకులు పాలేటి చంటి, దుక్కిపాటి శశి భూషణ్, జిల్లా అధికార ప్రతినిధి మహిళా విభాగ అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ నగుళ్ల సత్యనారాయణ, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట స్థానిక కొత్తపేటలో టిడిపి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ అనారోగ్యలతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి లలితా రామకృష్ణ ఆర్థిక సౌజన్యంతో షేక్ అలీషా (పూల కొట్టు), షేక్ సుభాని (టైలర్) సదరు కుటుంబాలకు ఆర్థిక వితరణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులు నెక్కళపు శ్రీనివాసరావు (డాబా శ్రీను) కొత్తపేట పార్టీ నాయకులు వెంగళ వెంకటరామయ్య, షేక్ బాషా షేక్ అలీషా షేక్ సులేమాన్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మైలవరం : బుధవారం సాయంత్రం మండలంలోని పొందుకుల గ్రామంలో టిడిపి, జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా తనను, ఎంపి అభ్యర్థిగా కేశినేని శివనాథ్‌ను గెలిపిం చాలని ఎన్డీఏ కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ కోరారు.

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి - అవనిగడ్డ : శ్రీరామనవమి వేడుకలు అవనిగడ్డలో వాడవాడలా నిర్వహించారు బుధవారం కోదండ రామాలయాలు అభయ ఆంజనేయస్వామి ఆలయాలలోని శ్రీరామ సీతా లక్ష్మణ ఆంజనేయ చిత్రపటాలను ఊరేగింపుగా కృష్ణానదికి వెళ్లి అక్కడ స్నానమాచరించి తిరిగి ఆలయాలకు చేరుకొని వడపప్పు పానకం పంపిణీ చేశారు. అవనిగడ్డ తొమ్మిదో వార్డులో నిర్వహించిన కల్యాణంలో కొల్లి పిచ్చేశ్వరరావు దంపతులు కల్యాణంలో పాల్గొనగా మూడో వార్డులోని కోదండ రామాలయంలో నిర్వహించిన కళ్యాణంలో న్యాయవాది వడ్డీ రవీంద్ర దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకుని కంకిపాడు కోదండ రామాలయం లో బోడె ప్రసాద్ తనయుడు బోడే వెంకటరామ్ పూజ నిర్వహించారు పూజా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ , సుదిమెళ్ల రవీంద్ర , స్టాలిన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పిఎస్.రావుకు మాతృవియోగం

ప్రజాశక్తి - అవనిగడ్డ : తెలుగు లోగిలి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు దివిసీమ ప్రముఖులు డాక్టర్ పిఎస్.రావుకు మాతృయోగం కలిగింది. పిఎస్.రావు తల్లి పేర్ల కుటుంబాలు (కపమ్మ) బుధవారం మృతిచెందారు. నాగాయలంక మండలం తలగడ దీవిలోని వారి స్వగృహంలో కన్నుమూశారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా కృపమ్మ మృతికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు

కాంగ్రెస్ అభ్యర్థి శ్రీరామ్ మూర్తి ప్రచారం

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి అందే శ్రీరామ్ మూర్తి ప్రచారం ప్రారంభించారు బుధవారం ఉదయం అవనిగడ్డలో శ్రీ లంకమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుండి నియోజకవర్గ మొత్తం తమ ప్రచార రథాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇండియా వేదిక అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుంటుందని ప్రత్యేక హోదా సాధించాలంటే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాష్ట్రంలో యువజన హామీల అమలుకు కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు.

నేడు ఘనీ మాస్టర్ సంతాప సభ



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ, మాజీ యుటిఎఫ్ నాయకులు, సిపిఎం సీనియర్ నాయకులు షేక్ ఘని మాస్టర్ సంతాప సభ ఎస్‌జిఎస్ కళాశాల సమీపంలోని ఘనీ మాస్టర్ స్వగృహంలో నేడు సాయంత్రం 6 గంటలకు సంతాప సభ నిర్వహించనున్నారు. ఈ నెల 10వ తేదీ ఘని మాస్టర్ (76) గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే. రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి ఘని మాస్టర్ గడిచిన రెండు దశాబ్దాలుగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్, సెక్రటరీగా ఉంటూ సంఘానికి పెద్దదిక్కుగా ఉన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘంలో చురుగ్గా పని చేసి అనేక ఉద్యమాలు చేపట్టారు. వామపక్ష భావజాలంతో యుటిఎఫ్ తొలితరం నాయకులుగా పని చేసి జగ్గయ్యపేట ప్రాంతంలో సంఘ అభివృద్ధికి విశేషమైన కృషి చేశారు. వాహన సదుపాయాలు కూడా సరిగా లేని రోజుల్లో జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలలోని వివిధ గ్రామాలలో ఉన్న పాఠశాలలకు సైకిళ్లపై, కొన్ని సందర్భాల్లో ఆ రూట్లలో వెళ్లే లారీలపై వెళ్లి యుటిఎఫ్ సభ్యత్వ నమోదు చేయించారు. రిటైర్మెంట్ అనంతరం కూడా పెన్షనర్స్ అసోసియేషన్‌లో నాయకుడిగా పనిచేసి పెన్షనర్స్‌కు సేవలందించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేశారు. ఘని మాస్టార్ సిపిఎం సీనియర్ నాయకులుగా ఉంటూ పార్టీకి ఎంతో సహకరించారు. జగ్గయ్యపేట డివిఆర్ నగర్‌లో సిపిఎం సుందరయ్య భవన్ నిర్మాణానికి సైతం తన వంతు ఆర్థిక సాయం అందించారు. సిపిఎంలో నీతికి, నిజాయితీకి మారుపేరుగా ఉంటూ పార్టీకి అంకితభావంతో పనిచేశారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరినీ ఆప్యాయంగా పలకరించి తన అభిమానాన్ని చాటుకునేవారు.

నేడు శ్రీరామ్ సక్కుబాయి సంతాప సభ



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు, ఉమ్మడి టిడిపి, జనసేన, బిజెపిల అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్ తల్లి శ్రీరామ్ సక్కుబాయి 7న మృతి చెందిన విషయం విధితమే. గురువారం చిల్లకల్లు రోడ్‌లో శ్రీలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఆవరణలో శ్రద్ధాంజలి నిర్వహించనున్నారు.



చలివేంద్రం ప్రారంభించిన శ్రీదేవి, తదితరులు

ఐద్వా ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి చలి వేంద్రం ప్రారం భించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ దండమూడి బిక్షపతి మోటూరి ఉదయం వర్ధంతి సందర్భంగా వారి పేర్లు మీద ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో పైపుల్ రోడ్‌లో ఈ కార్యక్రమం గత ఏడు సంవత్సరాలుగా చేపడుతున్నామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ దేవి కుమారి మల్లేశ్వరి, విజయలక్ష్మి, అరుణ, అమ్ములు, రత్నకుమారి, పిచ్చమ్మ నిర్మల చంద్రమణి శివమ్మ పాల్గొన్నారు.

ఇండియా వేదిక, పలు ప్రజా సంఘాలు బలపరచిన

సిపిఎం సెంట్రల్ అభ్యర్థి సిహెచ్.బాబూరావు రేపు నామినేషన్

- ★సింగ్‌నగర్ నుంచి ప్రదర్శన
- ★ధర్నా చౌక్‌లో సభ
- ★హాజరుకానున్న ఇండియా వేదిక నేతలు



ప్రజాశక్తి - విజయవాడ : కాంగ్రెస్, సిపిఐ, ఆప్, లిబరేషన్, ఆర్‌జెడి, ఇండియా వేదికలోని పార్టీలు, కార్మిక, సామాజిక, ప్రజా సంఘాలు బలపరిచిన సిపిఎం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు 19వ తేదీ ఉదయం నామినేషన్ దాఖలు చేస్తారని ఆ పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 10 గంటలకు అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు సెంటరు నుండి భారీ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శన గాంధీనగర్ అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్ వరకూ సాగుతుందని తెలిపారు. అనంతరం సభ జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, మాజీమంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ ఎన్‌టిఆర్ జిల్లా నాయకులు నరహరి శెట్టి నరసింహారావు, మాజీ అధ్యక్షులు వి.గురునాథం, ఆప్ జిల్లా నాయకులు పరమేశ్వరరావు, లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, ఆర్‌జెడి నాయకులు, అభ్యర్థి సిహెచ్.బాబూరావు, ఇండియా వేదికలోని ఇతర పార్టీల రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రదర్శన, సభల్లో ప్రజలు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, యువజనులు, శ్రేయోభిలాషులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని డి.వి.కృష్ణ కోరారు.


నేడు సుజనా నామినేషన్



ప్రజాశక్తి - భవానీపురం : కూటమి బలపరచిన విజయవాడ పశ్చిమ బిజెపి అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. చిట్టినగర్ కొత్త అమ్మవారి గుడి దగ్గర నుండి ర్యాలీగా బయలుదేరి భవానీపురం ఆర్ఒ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు.

ఆర్‌కెఎస్ చిలకా మూర్తి టవర్స్‌లో వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఆర్ కె ఏస్ చిలకా మూర్తి టవర్స్ నందు బుధవారం శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎన్.నాగరాజు, ఎన్.నవీన్ ,సూర్యం కుటుంబ సభ్యులు అధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అసోసియేషన్ అధ్వర్యంలో ప్రతి ఏటా శ్రీ రామ నవమి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. వేడుకల్లో పాల్గొన్న వారికి తీర్థ ప్రసాదములు అందచేశారు.





వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : గుణదలలోని వైసిపి తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో సుమారు 100 మందికిపైగా స్థానికులు పార్టీలో చేరినట్లు వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోని కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం దేవినేని అవినాష్ మాట్లాడారు. కోఆప్షన్‌కమిటీ సభ్యులు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ముగ్గురు వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఐదో వార్డ్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ సమక్షంలో మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు.

సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : నగరంలోని విద్యాధరపురంలోనీ లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లో సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గరిమెళ్ళ విద్యాశ్రీ, నాన్నయ్య చౌదరి మాట్లాడుతూ ఏప్రిల్ 17వ తేదీ ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ 40 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రోజు ఈ ఎగ్జిబిషన్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. జైపూర్ పింక్ పాలస్ ముఖద్వారంతో ఎంతో ఆకర్షణీయంగా ఎగ్జిబిషన్ ఉంటుంద న్నారు. ఆటవిడుపు కోసం జైంట్ విల్, మేరి కొలంబస్, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రైన్, ఇండియన్ టొరా టోరా, ఇటాలియన్ ఐటమ్స్ వంటి ప్రత్యేకమైన ఆట వస్తువులు ఉన్నాయన్నారు. బెడ్ షీట్స్, బెంగాలీ కాటన్, శారీస్, లక్నో సారీస్, నైటీస్, కాస్మోటిక్, గాజులు అనేకమైన ఆటబొమ్మలు, హ్యాండ్లూమ్స్, హ్యాండ్ క్రాఫ్ట్ స్టాల్స్, అనేక రకాల ఫుడ్ స్టాల్స్ ఎగ్జిబిషన్లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతిరోజు సాంస్కతి కార్యక్రమాలు జరుగుతాయని గరిమెళ్ళ నానయ్య చౌదరి పేర్కొన్నారు. ప్రారంభ సంధర్భంగా సబ్బా శివకుమార్ శిష్య బందం ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.





ఎఐ టెక్నాలజీతో సరికొత్త శాంసంగ్ టివిలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ కంపెనీ శామ్‌సంగ్ సరికొత్త ఎఐ టెక్నాలజీతో కూడిన టివిలను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.రాజేష్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని షోరూమ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. వినియోగదారులకు సంబంధించి ఎప్పటికపుడు సరికొత్త టెక్నాలజీతో కూడిన టివిలను తీసుకురావడంలో శాంసంగ్ ముందుంటుందని తెలిపారు. ఇందులో భాగంగానే అన్‌బాక్స్ అండ్ డిస్కవర్‌లో తన అల్ట్రా ప్రీమియం నియో క్యూఎల్ఇడి 8కె, నియో క్యూఎల్ఇడి 4కె, ఓఎల్ఇడి టివిలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లోకి వచ్చిన టివిలన్నీ అధునాతన, శక్తివంతమైన టెక్నాలజీతో తీసుకువచ్చినట్లు తెలిపారు.

బాదం ఉత్పత్తులతో చక్కటి ఆర్యోగం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్నారని, బాదంతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వలన ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రముఖ డైటీషియన్ రితాకా సుదర్శన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆరోగ్య రక్షణపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకుగాను వివిధ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా బాదంతో చేసిన ఉత్పత్తులు లేదా బాదంను రోజూ తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రోటీన్లు, డైటరీ ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులుచ విటమిన్లు, మెగ్నీషియం వంటి ఖనిజాలు బాదంలో ఉంటాయని, అందుకే వీటి వినియోగం పెరగాలన్నారు. బాదం పప్పును దినచర్యలో చేర్చడం వల్ల చక్కటి పోషకాహారంతో పాటు దీర్ఘకాల శక్తిని అందిస్తుందన్నారు. బాదంతో పాటు పచ్చి ఆకు కూరలుచ, సీజనల్ ఫ్రూట్స్ వంటి ఆహార పదార్థాలను తీసుకోవడం వలన ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

దేవస్థానం భూములు కౌలుకు వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన వేదాద్రి, బండిపాలెం, రావిరాల గ్రామంలోని మొత్తం 144.77 ఎకరాలకు సన్నకారు రైతులుగా సాగుచేసుకొనే భూములు వేదాద్రి గ్రామంలోని సర్వే నెం.100లో 2.00 ఎకరాలకు, 11-1లో 2.00 ఎకరాలకు 150లో 5.00 ఎకరాలకు, బండిపాలెం గ్రామంలోని సర్వే నెం.207-1లోని 3.50 ఎకరాలకు, రావిరాల గ్రామంలోని సర్వే నెం.83లో 3.50 ఎకరాలకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ నెల 22న కౌలుకు సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి శిరపరపు హేమలత దేవి తెలిపారు.